క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కారేపల్లి: కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 14 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శకుంతల, తహసీల్దార్ సంపత్‌కుమార్, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, ఎంపీటీసీ రమాదేవి, మంజుల, చంద్రప్రకాశ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సత్తుపల్లిరూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి తహసీల్దార్ యోగీశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్‌లో శనివారం మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.చిన్నానాగేశ్వరరావు, ఐబీ వర్క్ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, ఆర్ఐలు నరేష్, జానిమియా, కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

తల్లాడ: వర్షాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రత్నమనోహర్, ఎస్ఐ కొండల్‌రావు, విద్యుత్ ఏఈ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బుల్లితెరకు మధిరవాసి ఎంపిక

మధిర: మధిర పట్టణానికి చెందిన కపిలవాయి వెంకట సుబ్రహ్మణ్య శ్రీధర్ బుల్లితెరలో నటించేందుకు ఎంపికయ్యారు. స్థానిక ముస్లిం బజారుకు చెందిన శ్రీధర్ ఇంటింటి రామాయణం అనే టీవీ సీరియల్‌లో నటించే అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా మధిర ప్రాంత ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

దొడ్డి కొమరయ్య చిత్రానికి సహ నిర్మాతగా శ్రీనివాసరావు

తల్లాడ: త్వరలో నిర్మించనున్న దొడ్డి కొమరయ్య చిత్రానికి సహ నిర్మాతగా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన ఎక్కిరాల శ్రీనివాసరావును ఎంపిక చేశారు. శనివారం ఖమ్మం చెరువుబజార్‌లో ఉన్న దొడ్డి కొమరయ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో దొడ్డి కొమరయ్య చిత్ర దర్శకుడు మహలంక సేనాపతి(సాయిబాబా) సమక్షంలో సహనిర్మాతగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎక్కిరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సహ నిర్మాతగా ఎంపిక చేసిన దర్శకుడు సేనాపతికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల రుణాల జాబితా ప్రకటించాలి

కొణిజర్ల: రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏ బ్యాంకులో ఏ రైతుకు ఎంత మాఫీ అయ్యిందో తక్షణమే జాబితా ప్రదర్శించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం కొణిజర్లలో ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రుణమాఫీ విషయంలో గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కొందరు రైతులు మాఫీ కాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. లీడ్‌బ్యాంక్ అధికారులు తక్షణమే వ్యవసాయాధికారులకు రైతుల జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

గేదెను కాపాడిన పోలీసులు

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి చెందిన ఎస్‌కే ఖాసింసాహెబ్‌కు చెందిన రూ.లక్ష విలువైన పాడి గేదె ఇంటి సమీపంలోని పొలాల వైపు మేతకు వెళ్లింది. ఆ క్రమంలో అక్కడే ఉన్న పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడింది. దీంతో స్థానికులు గుర్తించి బ్లూకోట్ కానిస్టేబల్ ప్రకాష్‌కు సమాచారం అందించడంతో.. ఎస్సై పి.వెంకటేష్ సూచనలతో.. క్రేన్ తెప్పించి ఎస్‌కె రహీం సాయంతో గేదెను రక్షించారు.

అభివృద్ధిలో 'బోనకల్' ముందంజ

- ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక
- మౌలిక వసతుల కల్పనలో మేటి

అభివృద్ధి పథంలో బోనకల్ గ్రామపంచాయతీ దూసుకుపోతుంది. ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన బోనకల్ గతంలో ఎంతో వెనుకబాటుకు గురైంది. సరైన రహదార్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కానీ నేడు పలు గ్రామ పంచాయతీలకు బోనకల్ గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలిచింది.



బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

సండే స్పెషల్

బోనకల్: బోనకల్ గ్రామపంచాయతీని ఉత్తమ జీపీగా రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా వ్యాప్తంగా 589 పంచాయతీలకు గాను 9 జీపీలను వివిధ విభాగాల కింద ఉత్తమ జీపీలుగా ఎంపిక చేశారు. గ్రామపంచాయతీకి మౌలిక వసతుల కల్పనకు గాను ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద గ్రామంలోని అంతర్గత రహదారులన్నీ సీసీ రోడ్లుగా మారాయి. సైడ్‌డ్రెయిన్లు నిర్మించడం, రోడ్ల వెంబడి మొక్కలు నాటడంతో అవి పెరిగి అహ్లాదకరంగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించడంలో మాజీ సర్పంచ్ భూక్యా సైదానాయక్, పంచాయతీ కార్యదర్శి దామాల కిరణ్ విశేష కృషి చేశారు.

పరిగనలోకి మౌలిక వసతులు..

ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక కావడంలో పలు అంశాలను పరిగనలోకి తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా సీసీ రోడ్లు, సైడ్‌డ్రెయిన్లు నిర్మాణం, వైకుంటధామం, కంపోస్ట్ షెడ్లు, రైతువేదిక, పల్లె ప్రకృతివనం, నర్సరీ, ఆర్వోబిడ్జి కింద కమ్యునిటీ టాయ్‌లెట్స్ వంటి మౌలిక వసతులను కల్పించారు. బోనకల్ వైకుంటధామం జిల్లాకే ఆదర్శంగా ఉండేలా మాజీ సర్పంచ్ భూక్యా సైదానాయక్ కృషి చేశారు. కలెక్టర్ స్వయంగా పరిశీలించి జిల్లా వ్యాప్తంగా ఇదేరకంగా నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పడం విశేషం. అన్ని హంగులతో వైకుంటధామాన్ని స్వర్గధామంగా నిర్మించారు. వైకుంటధామంలో కావాల్సిన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు.

సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు..

మృతదేహాల అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రత్యేక వాహనాన్ని మాజీ సర్పంచ్ సైదానాయక్ తన సొంత ఖర్చులతో సౌకర్యాలు కల్పించారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం కూర్చోడానికి బల్లలు, మంచినీటి సౌకర్యం దశదిన కర్మలు చేయడానికి ప్రత్యేక గదులు, పచ్చని చెట్లతో అహ్లాదకరంగా ఉండేవిధంగా వైకుంటధామాన్ని తయారు చేశారు. అదేవిధంగా కంపోస్ట్ షెడ్డు కూడా గ్రామస్తులకు ఉపయోగపడేలా నిర్మాణం చేపట్టి కంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులు ఉపయోగించుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్వోబి బ్రిడ్జి కింద అక్రమ కట్టడాలను తొలిగించడం.. మండల కేంద్రానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం కమ్యునిటీ టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. ఇలా పలు అంశాలలో బోనకల్ గ్రామపంచాయతీ పలు గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తుంది.



వైకుంఠధామంలో శివుడి విగ్రహం



పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉన్న రహదారి

అందరి సహకారంతో అభివృద్ధి చేశాం..



ప్రజలందరి సహకారంతో గ్రామపంచాయతీని అభివృద్ధి చేసుకున్నాం. అంతర్గత రహదారులు, మౌలిక వసతుల కల్పనలో విశేషంగా కృషి చేశాం. ప్రస్తుతం జిల్లాస్థాయిలో బోనకల్ పంచాయతీ ఉత్తమ జీపీగా ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో కూడా ఎంపికౌతుందని ఆశాబావం వ్యక్తం చేస్తున్నాం.

– దామాల కిరణ్, పంచాయతీ కార్యదర్శి, బోనకల్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల్లో కూడా న్యాయ సేవాధికార సంస్థ, ప్రభుత్వ వైద్యులతో కలిసి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వి.లావణ్య, ఏఓ బోయినపల్లి రవి, ఏరియా ఆస్పత్రి వైద్యులు బి.సురేష్ నారాయణ్, డాక్టర్ పి.రాజేష్, స్టాఫ్ నర్సులు స్వరూప, మాధురి, ఆస్పత్రి సిబ్బంది సాంబశివరావు, నాగయ్య, న్యాయవాదులు లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం గ్రామం గట్టుబజారులో ఉన్నటువంటి యానాదుల కుటుంబాలు నీట మునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాసరి మధుమోహన్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, దయానంద్, మట్టా యువసేన సభ్యులు ఆ కుటుంబాల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారిని వెంటనే పునరావాస కేంద్రానికి తరలించాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశించగా.. నాయకులు బాధితులను స్థానిక ఎస్సీ హాస్టల్‌లోకి తీసుకెళ్లారు.



యానాదుల కాలనీ వాసులను హాస్టల్ భవనానికి తరలిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన సింగరేణి ఎంపీపీ

కారేపల్లి: సింగరేణి ఎంపీపీ మాలోత్‌శకుంతల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో శుక్రవారం ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు, ఆమె భర్త చీమలపాడు మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్ సైతం కాంగ్రెస్‌లో చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ప్రధాన అనుచరులుగా ఉన్న ఎంపీపీ శకుంతల, మాజీ సర్పంచ్ కిషోర్‌లు కాంగ్రెస్‌లో చేరడంతో మండల బీఆర్ఎస్‌కు షాక్ తగిలినట్లయ్యింది.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం



కొణిజర్ల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఉషారాణి



బోనకల్: ముష్టికుంట్లలో..

కొణిజర్ల: కొణిజర్ల ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ ఏసీడీపీఓ యం.ఉషారాణి ముఖ్య అతిధిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా తల్లులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాంబాయి పాల్గొన్నారు

కారేపల్లి: కారేపల్లి సంతగుడి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (చింతలబడి) ఆవరణలో అంగన్‌వాడీ చిన్నారులకు నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు పలకలు, నోట్ పుస్తకాలు, చార్ట్‌లు, బలపాలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం జాకీర్‌బాబా, ఉపాధ్యాయురాలు సునీత, అంగన్‌వాడీ సూపర్ వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

బోనకల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస్యాలు నిర్వహించగా.. ఏసీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, తల్లులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, వెంకటాపురం గ్రామాల్లో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో.. ఐసీడీఎస్ ఏసీడీపీఓ జి.కృష్ణశ్రీ, సూపర్‌వైజర్లు సరిత, రమణలు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

ముదిగొండ: మిట్టగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం శనివారం నిర్వహించగా.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, వాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



సత్తుపల్లిరూరల్: గౌరిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ సుజాత, టీచర్లు

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత కోరారు. సత్తుపల్లి మండలం గౌరిగూడెంలో, పెనుబల్లిలోని లంకపల్లి సర్కిల్ ఎరుగట్లలో శనివారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మురళీ, మురళీకృష్ణ, వీఓ సీహెచ్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు మరియమ్మ, సుశీల, రాఘవమ్మ, ఆయాలు ఆదిలక్ష్మి, కృష్ణవేణి, ప్రియాంక లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముగిసిన పూర్వ ప్రాథమిక విద్యా శిక్షణ

కల్లూరు: కల్లూరు ప్రాజెక్ట్ పరిధిలో జూన్ 19 నుంచి 20వ తేదీ వరకు బ్యాచ్‌ల వారీగా పూర్వ ప్రాథమిక విద్య శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 275 మంది అంగన్‌వాడీ టీచర్లకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చారు. అదే విధంగా అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు ప్రతి కేంద్రం నుందు జూలై 15 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించడం జరిగిందని సీడీపీఓ మెహర్నిసా భేగం పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుజాత, ఏసీడీపీఓ మహబూబ్ అలీ, యూడీసీ శివరామకృష్ణ, భవాని, సంధ్యారాణి పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న టీచర్లు

ఇంటింటా చదువుల పంట



మధిరరూరల్: సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

మధిరరూరల్: ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని ఇంటింటా చదువుల పంట యాప్ డౌన్లోడ్ చేసుకుని విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన పెంపొందించాలని మడుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లింగంపల్లి అప్పారావు కోరారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయనతో పాటుగా సీనియర్ ఉపాధ్యాయుడు కేవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నరేంద్ర కుమారి, టీచర్ లక్ష్మి, విజయమ్మ, అరుణ, అశోక్ పాల్గొన్నారు.

ముదిగొండ: విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని హెచ్ఎం సురేష్ అన్నారు. శనివారం పమ్మి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉపాధ్యాయులు షర్మిల, నాగలక్ష్మి, వెంకటరమణారెడ్డి లు పాల్గొన్నారు.

ఏన్కూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని హెచ్ఎం కూరకుల సైదయ్య కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల చేత చదివించాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: బడిఈడు పిల్లలందరినీ క్రమం తప్పకుండా బడికి పంపించాలని ఉపాధ్యాయులు సూచించారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్ఎం సుధాకర్‌రెడ్డి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో నర్సారెడ్డి, లాల్ అహ్మద్, వెంకటేష్, నర్సింహారావు, శేషుకుమార్ పాల్గొన్నారు.

కల్లూరురూరల్: పిల్లలను చదివించాలనే పట్టుదల తల్లిదండ్రుల్లో ఉండాలని పేరువంచ జిల్లా పరిషత్ హెచ్ఎం సీహెచ్ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ మౌలాలి, శిరీష, శ్రీనివాసరావు, సురేష్, రామానాయక్, జ్యోతి, మధుశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



విద్యార్థికి నోట్ పుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొంగులేటి మాధురిల సహకారంతో నోట్ పుస్తకాలు, స్టేషనరీ, ప్యాడ్స్, డ్రాయింగ్ బుక్స్, కంపాక్స్, టేబుల్ బుక్స్ పంపిణీ చేశారు. వీటిని కాంప్లెక్స్ హెచ్ఎం పత్తిపాటి నివేదిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి విద్యార్థులకు అందించి మాట్లాడారు. విద్యార్థులకు స్టేషనరీ అందించారు మంత్రి పొంగులేటి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, హైస్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి, రవిరాజా, కె.విజయ్‌కుమార్, పీఈటీ వీర రాఘవయ్య, కొర్లగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చక్రవర్తి, టీచర్లు కృష్ణబాబు, సీహెచ్ వీరస్వామి పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా రమణారెడ్డి

బోనకల్: బోనకల్ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో వర్క్ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బజ్జూరి రమణారెడ్డి ఇరిగేషన్ ఎంప్లాయిస్ యూని యన్ జిల్లా అధ్యక్షుడిగా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హసన్, బోనకల్ సబ్ డివిజన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ కూరపాటి రాజేష్,ఆఫీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫొటో గ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణస్వామి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండల ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణస్వామి ఎన్నికయ్యారు. స్థానిక మాధురి ఫంక్షన్‌హాల్‌లో శనివారం సాయంత్రం సత్తుపల్లి మండల ఫొటో గ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు, సెక్రటరీ నాగేశ్వరరావు, సీనియర్ ఫొటో గ్రాఫర్లు హరి, కల్కి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా తాటి సుబ్బారావు, సుబ్బారావు, సెక్రటరీగా కె.హరీష్, ట్రెజరీగా చెన్నారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పమ్మి ప్రసాద్‌కు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. అదే సమయంలో ప్రసాద్ ఇంటి బయట ఉండడంతో ప్రమాదం తప్పింది. కూలీ పనులు చేసుకునే ప్రసాద్ ఇళ్లు కూలిపోవడంతో పక్కన ఉన్న బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నాడు. మున్సిపల్ కమిషనర్ చింతల వేణు సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితునితో మాట్లాడారు. అవసరమైన సహాయాన్ని మున్సిపాలిటీ నుండి చేస్తామని హామీ ఇచ్చారు.

పేద ప్రజల గుండెల్లో 'రాయల'

వైరా: యాభైఏళ్లు నిరుపేదలు, అణగారిన ప్రజలకోసం పోరాటం చేసిన రాయల చంద్రశేఖర్ అజరామరుడని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య, వైరా డివిజన్ కార్యదర్శి కంకణాల అర్జునరావు కొనియాడారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్, ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిన చంద్రశేఖర్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందగా శనివారం వైరాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లందు ఏరియాలో పార్టీ బలోపేతానికి చంద్రశేఖర్ కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములు, జానీ, నాగేశ్వరరావు, ప్రతాప్, సాయమ్మ, రమణ, పద్మ, గ్రేసమ్మ, చంద్రకళ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెగని వాన..

గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో చేతి వృత్తిదారులు, కూలీలు, చిరు వ్యాపారులు తమ పనులను మానేసి ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాలకు మండలాల్లోని నదులు ఉధృతంగా ప్రవహించగా, చెరువులు అలుగుపోస్తున్నాయి. పంట పొలాలు, చేలు నీటితో మునిగిపోయాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు నదులను పరిశీలించి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో పలుగ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు, గృహాలు నీటితో నిండిపోగా.. విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల పారుతున్న అలుగులను ప్రజలు పరిశీలించగా.. యువకులు చేపలు పట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుబల్లి: లంకాసాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్



సత్తుపల్లిటౌన్: అలుగు పారుతున్న తామరచెరువు



వైరారూరల్: గన్నవరం వద్ద వైరా నదిని పరిశీలిస్తున్న ఎస్సై వంశీకృష్ణ, భాగ్యరాజ్



కల్లూరురూరల్: కల్లూరు పెద్దచెరువు దగ్గర రెవెన్యూ, పోలీసు అధికారుల నిఘా



పొంగి ప్రవహిస్తున్న జాలిముడి ప్రాజెక్ట్



వేంసూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పవాగు



చింతకాని: నాగులవంచ వద్ద వాగు వరదను పరిశీలిస్తున్న మండల అధికారులు, ఎస్సై